APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం



పంపుటి : 1 | సంచిక : 7 | ఒంగోలు | మంగళవారం 9-9-2025 | ఎడిటర్ : కుమార్ | పబ్లిషర్ : నరాల మురళీ | పేజీలు : 4 | వెల : రూ. 4/-

Ongole I Srikakulam I Vizianagarm I Visakhapatnam I Rajahmundry I Kakinada I Elugu I Vijayawada I Guntur I Kurnool I Kadapa I Chittore I Warangal I Srikakulam I Hyderabad I Mehabubanagar

## అమెరికా సుంకాల వేళ.. మోదీ 'స్వదేశీ మేళా'

**ఎన్డీఏ ఎంపీలకు ఆదేశం! ఎన్డీఏ పార్టీల ఎంపీలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగం**



**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** భారతీయ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఎన్డీఏ ఎంపీలు స్వదేశీ మేళాలను నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అంతేకాదు, సవాళ్లను అధిగమించి ఎదిగేందుకు దేశం స్వయం సమృద్ధిని సాధించడం కీలకమని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో దిల్లీలో ఎన్డీఏ పార్టీల ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ, పలు వ్యాఖ్యలు చేశారు.


**ఆత్మనిర్భర్ స్ఫూర్తి కొనసాగించాలి! :** అయితే భారత్‌పై

మిగతా 2లో

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంతా రె'ఢీ'

**అభ్యర్థుల బలాబలాలు ఎలా ఉన్నాయంటే! సెప్టెంబం 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక- గెలుపు అవకాశం ఎవరికి ?**

**న్యూఢిల్లీ, ప్రజలకు చేరువ ప్రతినిధి :** ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. మంగళవారం జరగనున్న ఎన్నిక కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. రేపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, సాయంత్రం ఆరు గంటలకు లెక్కింపు జరగనుంది. లెక్కింపు పూర్తికాగానే



ఫలితాలను వెలువరించనున్నారు. ఈ ఎన్నికకు దూరంగా ఉంటామని ఇప్పటికే బీఆర్ఎస్, బీజేడీలు ప్రకటించాయి.

**రాధాకృష్ణన్ ఎం. సుదర్శన్ :** జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానాన్ని భర్తీ చేసేందుకు మంగళవారం జరిగే పోలింగ్‌కు

మిగతా 2లో

### గ్రామాలల్లో మొదలైన

## స్థానిక ఎన్నికల సందడి

**రిజర్వేషన్లపై ఎడతెరపి చర్చలు..**
**రిజర్వేషన్ వేషన్లు రోస్టర్ ప్రకారం జరుగుతాయా లేదా?**
**గతంలో అధికారంతో రిజర్వేషన్లు తారుమారుచేశారు**
**ఈసరైన రోస్టర్ ప్రకారం జరుగుతాయా**




**కనిగిరి, ప్రజలకు చేరువప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలను ముందస్తుగా జరుపుతుందనే సమాచారం తెలియడంతో ఇప్పటినుండే గ్రామాలల్లో ఎన్నికల సందడి మొదలైంది. ప్రభుత్వంఎన్నికలు ముందుగా జరిపితే సర్పంచ్ ఎన్నికలు జరపాలి. తరువాత ఎంపిటిసి, జడ్పిటిసిఎన్నికలు జరపాల్సి వస్తుంది. అయితే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు ఒక ఎత్తు సర్పంచ్ ఎన్నికలు ఒక ఎత్తు. సర్పంచ్ ఎన్నికలే గ్రామాలలో పార్టీల వారీగా, కులాలవారీగా వర్గపోరు మొదలవుతుంది. ఈఎన్నికలను ప్రతిక్కరు ప్రిస్టేజ్ ఇష్యు గా తీసుకుంటారు. ఎవరికీ వారు సర్పంచ్ గా గెలవడానికి లక్షల రూపాయలు యదజల్లుతారు. ఇప్పుడు మొదలైన

మిగతా 2లో



## యూరియా బ్లాక్ చేస్తే

# కఠిన చర్యలు

- యూరియా బ్లాక్‌మార్కెటింగ్‌పై
- అధికారులకు చంద్రబాబు ఆదేశం
- యూరియా దిగుమతికి జోవో జారీ
- యూరియా కోసం రైతుల అవస్థలు
- యూరియా పంపిణీలో తొక్కిసలాట



**అమరావతి, ప్రజలకు చేరువ ప్రతినిధి :** రాష్ట్రంలో యూరియా సమస్య లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మొత్తం 80,503 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. యూరియా సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, ఆర్టీజీఎస్, తురకపాలెంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పది రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రాబోతున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ఎరువుల కేటాయింపుపై కేంద్రమంత్రి నడ్డాతో సీఎం చంద్రబాబు మాట్లాడారు.

కాకినాడకు వచ్చే నౌకలో 7 రేక్‌ల యూరియా ఏపీకి ఇవ్వాలని సీఎం కోరారు. అందుకు నడ్డా సానుకూలంగా స్పందించారు. రబీ సీజన్‌లో యూరియా పంపిణీకి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని సీఎం అన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి ఎరువులపై రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. కర్నూలు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్లు, మద్దతు ధరపై సమీక్ష నిర్వహించిన చంద్రబాబు క్వింటా ఉల్లి ధర రూ. 1,200కు తగ్గకుండా చూడాలని స్పష్టం చేశారు. ఒకవేళ తగ్గితే మిగిలిన డబ్బును ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. అరకు కాఫీకి సోకిన కాయ తొలుచు తెగులుపై చంద్రబాబు ఆరా తీశారు. ఇతర ప్రాంతాలకు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తురకపాలెం గ్రామ

మిగతా 2లో

### విశాఖలో

## మళ్లీ మంటలు

**నేవీ సాయం కోరిన పోర్టు అధికారులు**



**విశాఖపట్నం, ప్రజలకు చేరువ ప్రతినిధి :** విశాఖ నగరంలో మళ్లీ ఆందోళన మొదలైంది. ఈస్ట్ ఇండియా పెట్రో కెమికల్స్ (ఈఐపీఎల్)లో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరగ్గా, నేడు మరోసారి మంటలు చెలరేగాయి. ఇథనాల్ ట్యాంకర్ పైభాగంలో భారీగా మంటలు అలముకోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం భారీవర్షం కురుస్తుండగా 7,500 టన్నుల సామర్థ్యం గల ఇథనాల్ ట్యాంక్ మీద పిడుగు పడింది. పిడుగుతో ట్యాంక్ పైకప్పు ఊడి పడిపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భయంకరంగా ఎగిసిన మంటలు పక్కనే ఉన్న మరికొన్ని ట్యాంకులకు వ్యాపించే ప్రమాదం ఏర్పడింది. ఏ క్షణాన పెద్ద ప్రమాదం జరుగుతుందోనన్న భయం స్థానికులను పట్టుకుంది. అధికారులు వెంటనే స్పందించి పది అగ్నిమాపక వాహనాలను అక్కడికి తరలించారు. రాత్రివరకు తీవ్రంగా కృషి చేసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈఐపీఎల్

మిగతా 2లో



# కూటమి 'సూపర్ హిట్'

**మూడు పార్టీలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న తొలి సభ ఇదే**
**15 నెలల పాలనపై అనంతపురంలో 10న భారీ బహిరంగ సభ**
**పాల్గొననున్న చంద్రబాబు, పవన్, లోకేశ్, మాధవ్**

కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలో సాధించిన విజయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ సిద్ధమయ్యాయి. అనంతపురంలోని ఇంద్రప్రస్థనగర్‌లో ఈ నెల 10న 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించనున్నాయి. అధికారంలోకి వచ్చాక మూడు పార్టీలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న తొలి సభ ఇదే కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా మూడు పార్టీల అగ్రనేతలు హాజరుకానున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది తరలివస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. 15 నెలల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు, రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చుతో సూపర్‌సిక్స్ హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాల్ని నేతలు వివరించనున్నారు. 'కలిసి వచ్చాం, కలిసి గెలిచాం, కలిసి పని చేస్తున్నాం. భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం' అనే సందేశాన్ని ప్రజలకు, మూడు పార్టీల కార్యకర్తలకు అందించనున్నారు. సామాజిక

మిగతా 2లో



### నల్గొండ ప్రజల కోసమే మూసీనది

## ప్రక్షాళన చేస్తున్నాం

**ఉస్మాన్‌సాగర్ వద్ద గోదావరి తాగునీటి పథకానికి శంకుస్థాపన... రెండేళ్లలో గోదావరి ఫేజ్ 2, 3 పూర్తి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం**

**తుమ్మడిహట్టి ఎత్తు పెంపుపై మహారాష్ట్రతో చర్చిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, ప్రజలకు చేరువ ప్రతినిధి :** నల్గొండ ప్రజల కోసమే మూసీనది ప్రక్షాళన చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని అక్కడి ప్రజలు కోరారని చెప్పారు. ఎవరు అడ్డు వచ్చినా ఈ పథకం పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. సమస్యలు సృష్టించినప్పుడు సమన్వయంతో ముందుకెళ్తామని వివరించారు. తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. హైదరాబాద్?లోని ఉస్మాన్‌సాగర్ వద్ద గోదావరి ఫేజ్ 2, 3 తాగునీటి పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులను చేపట్టనున్నారు. రెండేళ్లలో గోదావరి ఫేజ్ 2, 3 పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ

మిగతా 2లో

ప్రజలకి చేరువ
సామాన్యుడి ఆయుధం

# సంపాదకీయం

## అనర్థదాయకం!

సామాన్యులకు ఎంతోకొంత ఊరటగానున్న ఆరోగ్యశ్రీ పథక సేవలను, రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం అనర్థదాయకం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి హైబ్రిడ్ మోడ్‌లో యూనివర్సల్ హెల్త్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అది జనాన్ని వైద్య ఆరోగ్య సేవలకు దూరం చేయడమే అవుతుంది. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు బీమా కంపెనీ ద్వారా కుటుంబానికి ఏడాదికి రూ.2.5 లక్షల వరకు, ఆపైన ఖర్చయితే ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు కవరేజ్ ఉంటుందన్నది ప్రచారానికి బాగానేవుంటుంది. దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ.2 నుంచి 5లక్షల వరకు బీమా కవరేజ్‌ను అందిస్తామనీ ఇదంతా కలిపి యూనివర్సల్ హెల్త్ కవరేజి అని సర్కారు నమ్మబలుకుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 2015-16ల్లో ఎపిఎల్ కుటుంబాలకూ హెల్త్ కవరేజి అని ప్రచారం చేసి ప్రీమియంలు కట్టించుకున్నారేకానీ ప్రజలకు లబ్ధి చేకూరిన దాఖలాల్లేవు. తాజా పథకం ద్వారా 3257 రకాల వైద్య సేవలు అందజేస్తారని, ప్రతి రోగికి ఒక క్యూఆర్ కోడ్ ఇచ్చి అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్న అమాత్యుల మాట నీటిమీద రాతగానే మిగిలిపోవచ్చు.

రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించగా తొలి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల కళాశాలలో అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు నైపుణ్యానికి, నాణ్యతకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయి. ప్రైవేటు యాజమాన్యాలు మెరిట్ పక్కనబెట్టి సంపన్నులకే సీట్లు ఇస్తాయి కనుక పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం అవుతారు. వ్యాపార దక్పథం ముందుకు వచ్చి పేదలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది. వైద్య ఆరోగ్య రంగం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైనదని అనేక దేశాల్లో నిరూపితమైంది. యుకె, నెదర్‌ల్యాండ్స్ ఇంకొన్ని స్కాండినేవియన్ దేశాల్లో ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నడుస్తోంది. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే! ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే అది సాధ్యమవుతుంది. ప్రైవేట్ ఇన్స్యూరెన్సు కంపెనీలు వ్యాపారం చేస్తాయే కానీ సేవ చేయవు. అనర్థదాయకమైన ఈ నిర్ణయాలను ఉపసంహరించుకొని ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ఆరోగ్య సేవలను కొనసాగించాలి. సెల్ఫ్‌ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జిఓ 107, 108ని రద్దు చేయాలి. ఇదిలావుండగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రాజ్యాంగాన్ని, సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉల్లంఘించి ప్రైవేటు పంప్డ్ స్టోరేజి హైడ్రో ప్రాజెక్టుకు అనుమతులిచ్చిన ప్రభుత్వం గురువారంనాటి క్యాబినెట్ సమావేశంలో వాటి సామర్థ్యం పెంచడం, నీటి కేటాయింపులను కూడా చేయడం దారుణం. జలవనరుల శాఖ మార్గదర్శకాలు, లభ్యతకు అనుగుణంగా కేటాయింపులకు ఆమోదం తెలిపామని చెబుతున్నా ఆచరణలో నదుల్లోని నీటిని విద్యుత్ ప్రాజెక్టులే పొందుతాయి కనుక దిగువనున్న ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కడప జిల్లా కొండాపురం మండలంలో చింత గ్రీన్ ఎనర్జీ కొప్పోలు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు ఏకంగా గండికోట రిజర్వాయర్‌ను లోయర్ రిజర్వాయర్‌గా ఉపయోగించడానికి ఆమోదం తెలపడం ప్రమాదకరం. గత వైసిపి ప్రభుత్వ పెద్దలు లంచాలు బొక్కి ఒప్పందాలు చేశారని అమెరికాలో కేసులు వచ్చిన సెకి చేసిన సత్యసాయి జిల్లా ముత్తుకుంట గ్రామంలో రూ.800 కోట్ల ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలపడం ద్వారా ఇప్పుడు కూడా గత పాలకుల విధానాలే కొనసాగుతున్నాయని చెప్పడమే అవుతుంది. సామాన్యులకు అందే వైద్య ఆరోగ్య సేవలను వారికి దూరం చేసి అదాని అంబానీ వంటి కార్పొరేట్లకు కాసులు కురిపించే విధానాలను ప్రభుత్వం విడనాడాలి. అటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి. లేకపోతే రాష్ట్ర ప్రజలకు హాని జరగడమేగాక ప్రభుత్వానికి కూడా రాజకీయంగా చేటు కలగవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

## అమెరికా సుంకాల వేళ

అమెరికా సుంకాల వేసిన మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ, కొన్ని సవాళ్లు తప్పవని ఆయన తెలిపారు. అటువంటి సమయాల్లో ఆత్మనిర్భర్ స్ఫూర్తిని కొనసాగించాలని చెప్పారు. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండని కోరారు. పార్లమెంటు నియోజకవర్గాల్లో ఈ మేరకు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**ప్రజలు గర్వపడాలి! :** ఎంపీలు తమ నియోజకవర్గాల్లో మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ఉత్సవాలు నిర్వహించాలని, దీని కోసం నాయకత్వ పాత్ర పోషించాలని ఆయన కోరారు. జపాన్ వస్తువుల గురించి ఒకప్పుడు వారు గర్వించినట్లే, మేడ్-ఇన్- ఇండియా ఉత్పత్తులను కలిగి ఉన్నందుకు ప్రజలు గర్వపడాలని ఆయన అన్నారు. హాజరయ్యే ప్రతి కార్యక్రమంలో “స్వదేశీ” భాగం కావాలని మోదీ తెలిపారు.

అదేవిధంగా జీఎస్టీ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వ్యాపారులతో సమావేశాలు నిర్వహించండని ఎంపీలకు ప్రధాని మోదీ సూచించినట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. తుఫాను వీచినా, తమ వాహనం టైర్లలో గాలిని నింపాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి ఒక ఉదాహరణగా చెప్పారు. అదే విధంగా, అనుకూలమైన వాతావరణం ఉన్నప్పటికీ సందేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి పని చేయాలని సూచించారు. అయితే ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో సరిగ్గా ఓటు వేసేలా ఎంపీలంతా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. పార్లమెంటు సభ్యులే తప్పు చేస్తే, అది కచ్చితంగా ప్రజల్లోకి తప్పుడు సందేశం వెళ్తుందని దిశా నిర్దేశం చేశారు. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్ సమావేశంలో పాల్గొన్నారు. సంఖ్యలు ఆయనకు అనుకూలంగా ఉండటంతో ఆయన విజయం దాదాపుగా ఖాయమైంది బీజేపీ మిత్రపక్షాలతో పాటు కార్యక్రమానికి హాజరైన జేడీ(ఎస్) నాయకుడు, మాజీ ప్రధాన మంత్రి హెచ్?డీ దేవెగౌడను మోదీ అభినందించారు. తమ కూటమికి 427 మంది ఎంపీలు ఉన్నారని, ప్రతిపక్షానికి 315 మంది ఎంపీలు ఉన్నారని ఎన్డీఏ వర్గాలు తెలిపాయి. రెండు ప్రధాన బ్లాక్‌లకు 39 మంది ఎంపీలు జతకట్టలేదని చెప్పారు. వారిలో, వైఎస్ఆర్ కాంగ్రెస్ రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటించగా, %ూ×వీ×వీ% ఏకైక సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రతిపక్షానికి చెందిన బి. సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలిపారు.

**మొదటి ఓటు మోదీదే :** 39 మంది ఎంపీలలో ఎక్కువ మంది రాధాకృష్ణన్‌కు ఓటు వేస్తారని కిరణ్ రిజిజు విశ్వాసం వ్యక్తం చేశారు, ఆయనను జాతీయవాది, చాలా మంచి వ్యక్తి అని ఆయన అభివర్ణించారు. మరోవైపు ఓటింగ్‌పై అవగాహన కోసం ఎంపీలకు మాక్ పోలింగ్ సెషన్ నిర్వహించారు. మంగళవారం ఎన్నిక నేపథ్యంలో తొలి ఓటు ప్రధాని మోదీ వేసే సూచనలు ఉన్నాయి. అనంతరం ఆయన వరద ప్రభావిత రాష్ట్రాలైన పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌ల పర్యటనకు వెళ్లనున్నారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంతా రె’డీ’

అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం జరగనున్న ఈ ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పోటీ పడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఓటింగ్‌ను ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు చెప్పాయి. ఈ ఎన్నికలో ప్రధాని తొలి ఓటు వేయనున్నట్లు తెలిపాయి. పార్లమెంట్ భవనంలో రహస్య ఓటింగ్ విధానంలో జరిగే పోలింగ్‌లో ఉభయ సభల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఫలితాలను ప్రకటించనున్నారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశము కూడా ఉంటుంది. దీంతో అధికార ఎన్?డీఏ పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.

**అభ్యర్థుల బలాబలాలు :** ఎలక్టోరల్ కాలేజీ విషయానికి వస్తే, లోక్‌సభలో 542 మంది సభ్యులు, రాజ్యసభలో 239 మంది సభ్యులు కలిసి మొత్తం 781 మంది ఉన్నారు. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. మెజార్టీ మార్కు 391 కాగా, అధికార ఎన్?డీఏ కూటమికి ఇప్పటి వరకు 425 సభ్యుల బలముంది. 11 మంది సభ్యులున్న వైసీపీ పార్టీ ఎన్?డీఏకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించడంతో మెజార్టీ పెరిగింది. దీంతో ఎన్?డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. అటు విపక్షాల ఇండియా కూటమికి 324 మంది బలముంది. కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా విపక్ష అభ్యర్థి విజయానికి దూరంగానే కనిపిస్తుంది.

**ఎన్నికకు దూరంగా బీఆర్ఎస్, బీజేడీ :** మరో వైపు ఈ ఎన్నికకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్‌తో పాటు బిజు జనతాదళ్ (బీజేడీ) ప్రకటించాయి. దీంతో బీఆర్ఎస్ నలుగురు, బీజేడీ ఏడుగురు సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ -మిజోరం లాంటి పార్టీలకు ఒక్కో సభ్యుడు మాత్రమే ఉన్నారు. విపక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు పది మంది ఎంపీలు ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించినప్పటికీ, ఎంపీ స్వాతి మాలివాల్?కు ఆ పార్టీతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో, ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది.

**మాక్ డ్రిల్ :** మరోవైపు ఎన్నిక ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఎన్?డీఏ, ఇండియా కూటమిలు తమ ఎంపీలతో వేర్వేలు సమావేశాలు నిర్వహించాయి. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో తమ ఎంపీలతో భేటీ నిర్వహించి ఈ ఎన్నికలో ఓటు వేయాల్సిన పద్ధతిని, పాటించాల్సిన విధివిధానాలను సభ్యులకు ఇండియా కూటమి వివరించింది. సమావేశం అనంతరం వారికి మాక్ పోల్ నిర్వహించారు. తమ కూటమి బలంగా ఉందని ప్రతిపక్షాలు పూర్తిగా ఐక్యంగా ఉన్నాయని విపక్ష ఎంపీలు అన్నారు. మెజార్టీ మార్జిన్ తక్కువగా ఉందని, అందువల్ల తమ అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. తప్పుడు ఓటింగ్ జరిగే అవకాశం లేకుండా మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు.

**పార్టీలకు అతీతంగా!**

పార్టీలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయాలని విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. వంద శాతం ఈ ఎన్నికల్లో గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేసిన ఆయన, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని కోరారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ప్రతి ఒక్కరూ దేశం పట్ల మాత్రమే ఆసక్తి చూపుతున్నారని వ్యాఖ్యానించారు.

## స్థానిక ఎన్నికల సందడి

వర్గాపోరు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల వరకు కొంసాగుతుంది.అందువలన ఈఎన్నికలు ప్రత్యేకమని చెప్పాలి.ఇదిలా ఉంటే రిజర్వేషన్ల సమస్య పెద్ద చిక్కొచ్చిపడింది. వారి వారి పంచాయతీలలో ఒకరు ఎస్సి లేదా ఎస్టీ అవుతుందంటే మరొకరు కాదుకాదు బిసి అవుద్దిఅంటారు మరొకరులేదు ఈసారి ఎస్సి మహిళా అయినా ఓసి జనరల్ అయినా అవుద్దని ఒకటే లెక్కలో ఉన్నారు. నలుగురు ఒక చోటఉన్నారు అంటే గ్రామాలలో ఇదే చర్చ జరుగుతుంది

**రిజర్వేషన్ వేషన్లు రోస్టర్ ప్రకారం జరుగుతాయా లేదా?**

ఎన్నికలకంటే ముందుగా రిజర్వేషన్ల సమస్య మొదలైంది. గత ఎన్నికల్లో నియోజకవర్గంలోని కొన్ని పంచాయతీలు ఎస్సి, బీసీలకు రిజర్వేషన్లను గత అధికారపార్టీ నాయకులు తమకు అనుకూలంగా అధికారం అండదండలతో ఓసి జనరల్ మార్చు కున్నారనే వార్తలు అప్పట్లో గుప్పుమన్నాయి.మరి ఈ కూటమి ప్రభుత్వం రిజర్వేషన్లను పాత పద్ధతి ప్రకారం నిర్వహిస్తారా లేక గత ప్రభుత్వంలాగ అనుకూలంగా మార్చుకుంటారో వేసి చూడాలి. ఏది ఏమైనా స్థానిక ఎన్నికలు వచ్చాయంటే కుల మరియు పార్టీల వర్గపోరుతోపాటు గ్రామాలలో జనసందడి ఎక్కువుగా ఉంటుంది కాబట్టి అక్కడ దక్కడ పండుగ వాతావరణం కనపడుతుందని చెప్పవచ్చు

## మళ్లీ మంటలు

ప్రాంతానికి సమీపంలోనే హెచ్‌పీసీఎల్ రిఫైనరీ, ఇంధన నిల్వల టెర్మినళ్లు ఉండటంతో ప్రమాదం మరింత ఆందోళన కలిగించింది. చిన్న తప్పిదం జరిగితే పెద్ద ప్రమాదం జరుగుతుందని ప్రజలు ఆందోళన చెబుతున్నారు. పక్కనే ఉన్న ట్యాంక్‌లకు మంటలు అంటుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో పోర్టు అధికారులు ఇండియన్ నేవీ సహకారం కోరారు. నేవీ హెలికాప్టర్ల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ జరుగుతోంది.

**భద్రతపై ప్రశ్నలు:** ఈ ఘటనతోపాటు ఒక కీలకమైన ప్రశ్న కూడా ముందుకు వచ్చింది. పిడుగులు పడకుండా అడ్డుకునే థండర్ అరెస్టర్ పరికరాలు సరిగ్గా పనిచేయలేదా? లేక వాటి నిర్వహణలో లోపాలున్నాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంత పెద్ద ట్యాంకులున్న ప్రదేశంలో పిడుగుపడితే అగ్ని ప్రమాదం జరగకుండా కఠిన భద్రతా చర్యలు ఉండాలి. ఆదివారం జరిగిన ఘటనపై హోంమంత్రి అనిత స్పందించారు. నగరవాసులు భయపడాల్సిన అవసరం లేదని, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అగ్నిమాపక చర్యలు జరుగుతున్నాయని భరోసా ఇచ్చారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

**సోమవారం మళ్లీ మంటలు:** కానీ ప్రజల్లో కలిగిన భయాందోళన ఇంకా తగ్గకముందే సోమవారం మళ్లీ మంటలు చెలరేగాయి. ఇథనాల్ ట్యాంకర్ పైభాగంలో మంటలు ఎగసిపడటంతో మరోసారి అధికారులు అప్రమత్తమయ్యారు. ఇండియన్ నేవీ సహకారంతో హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

## యూరియా బ్లాక్ చేస్తే

ఆరోగ్య పరిస్థితిపై నిత్యం సమీక్షించాలని సీఎం ఆదేశించారు.

**యూరియా దిగుమతికి జోవో జారీ :** మరోవైపు కాకినాడ పోర్టులో 17,293 మె.ట. యూరియా దిగుమతికి ప్రభుత్వం జోవో జారీ చేసింది. యూరియాను జిల్లాలకు అత్యవసరంగా పంపాలని మంత్రి అచ్చెన్న ఆదేశించారు. ఎటువంటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. ప్రస్తుతం 80,503 మె.ట. యూరియా నిల్వ ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం ఇప్పటికే రబీ కోసం 9.3 లక్షల మె.ట యూరియా కేటాయించిందని అచ్చెన్నాయుడు తెలిపారు.

**యూరియా కోసం రైతుల అవస్థలు :** అయితే రాష్ట్రంలో అనేకచోట్ల యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరడంతో కొన్ని పంపిణీ కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తతలు నెలకొన్నాయి. రాష్ట్రంలో ఎరువులు తగినన్ని అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం గుళ్లపూడిలోని సొసైటీ భవనం ముందు యూరియా కోసం క్యూలో చెప్పులు వదిలారు. ఉదయమే పెద్దఎత్తున రైతులు సొసైటీ భవనం వద్దకు తరలివచ్చారు. అధికారులు వచ్చేవరకు క్యూలో నిల్చోలేక చెప్పులు విడిచారు. విస్సన్నపేటలో యూరియా అందక రైతు సేవ కేంద్రాలు, సొసైటీల వద్ద అన్నదాతలు పడిగాపులు కాశారు. నరసాపురం, పుట్రేల కార్యాలయాల వద్ద ఎరువుల కోసం పెద్ద సంఖ్యలో బారులు తీరారు.

**యూరియా పంపిణీలో తొక్కిసలాట :** నెల్లూరు జిల్లా ఉదయగిరిలో రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీలో తొక్కిసలాట జరిగింది. RSKలో పంపిణీ చేసే యూరియా కోసం వందల సంఖ్యలో అన్నదాతలు బారులు తీరారు. క్యూలైన్ ల్లో నిలబెట్టేందుకు రైతులు కూలీలను తీసుకుని వచ్చారు. గంటల కొద్ది క్యూలైన్ లో ఉండటంతో తోపులాట జరగటంతో రైతులు, కూలీలు ఘర్షణ పడ్డారు. అధికారులు కొంత సమయం యూరియా పంపిణీ నిలిపివేసి పోలీసులు పర్యవేక్షణలో కొనసాగించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో యూరియా కోసం రైతులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. కొద్దిమంది వ్యాపారుల వద్దే బస్తాల నిల్వలు ఉండటంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఉదయం 5 గంటలకు వస్తుంటే తప్ప తమకు యూరియా దొరకటం లేదని రైతులు చెబుతున్నారు. పాలకొండలోని యూరియా దుకాణం వద్ద పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరారు. అవసరమైన మేరకు యూరియా నిల్వలు పెంచడం సహా అక్రమార్కులకు అడ్డకట్ట వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

## కూటమి ‘సూపర్ హిట్’

పింఛన్ల పెంపు, దీపం 2.0 కింద ఉచితంగా గ్యాస్ సిలెండర్ల పంపిణీ, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, పారిశ్రామిక పెట్టుబడులు, యూనివర్సల్ హెల్త్ పాలసీ సహా పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలను నేతలు ప్రధానంగా ప్రస్తావించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సహా అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల్ని సభలో చెప్పనున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూటమి పార్టీల సమన్వయం, కేంద్రం అందిస్తున్న సాయం, 60వేల నామినేటెడ్ పదవుల భర్తీని వివరించనున్నారు. రాష్ట్రంలో 5 కోట్ల మంది ప్రజలకు 25 లక్షల వరకూ వైద్య చికిత్సలు ఉచితంగా చేయించుకునేందుకు యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వివరించనున్నారు. ఏడాదిలోనే హంద్రీ-నీవా కాల్వల విస్తరణ ద్వారా రాయలసీమ చివరి భూములకు తొలి సారి సాగు నీరు అందించిన విషయాన్ని తెలపనున్నారు. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్, చేనేత ఉత్పత్తులకు జీఎస్టీ 5 శాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను చెప్పనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ‘అడవితల్లి బాటలో’ కార్యక్రమం ద్వారా 1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టిన విషయాన్ని వివరిస్తారు.

**ఏపీ బడ్జెట్? 2025: సూపర్-6 పథకాలకు భారీగా కేటాయింపులు**

పక్కాగా సభా ఏర్పాట్లు : సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభను కూటమి నాయకుల సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం అనంతపురంలోని రహదారుల, భవనాలశాఖ అతిథి గృహంలో మంత్రులు, ఇతర నాయకులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. సభ నిర్వహణ, హెలిప్యాడ్, పార్కింగ్, వచ్చే ప్రజలకు భోజనం, తాగునీరు, వసతులపై చర్చించారు.

## ప్రక్షాళన చేస్తున్నాం

వాటా 40 శాతం, కాంట్రాక్టు కంపెనీ 60 శాతం నిధులతో ఈ పథకం అమలుకానుంది. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా గోదావరి ఫేజ్ 2, 3 తాగునీటి పథకాన్ని చేపడుతున్నారు. జలమండలి అధ్వర్యంలో నిర్మించిన 16 రిజర్వాయర్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

**హైదరాబాద్ నగర ప్రజల దాహార్తి తీర్చడానికే :** గోదావరి నది జలాల ద్వారా హైదరాబాద్ నగర ప్రజల దాహార్తి తీర్చడానికి ఫేజ్-2, 3 పనులకు శంకుస్థాపన చేశామని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. హైదరాబాద్ దాహార్తి తీర్చడానికి గోదావరి నది జలాల తాగునీటి పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. హైదరాబాద్ నగర ప్రజల దాహార్తి తీర్చడానికే ఆనాడు నిజాం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించారని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలను పరిష్కరించడానికే మాజీ మంత్రి పి.జనార్దన్? రెడ్డి పోరాటాలు చేశారని గుర్తుచేశారు. రోజురోజుకి హైదరాబాద్ పరిధి విస్తరిస్తోన్న నేపథ్యంలో కృష్ణా జలాలను తరలించడం ద్వారా హైదరాబాద్? దాహార్తిని తీర్చవచ్చని ఆనాటి పాలకులు ఆలోచన చేశారని అన్నారు. వైఎస్ఆర్? పాలనలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌కు నీటిని తరలించినట్లు పేర్కొన్నారు.

“గోదావరి జలాలను రూ.7360 కోట్లతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లోకి తీసుకువస్తున్నాం. 20 టీఎంసీల నీటిలో దాదాపు 15 టీఎంసీలను నగర తాగునీటి అవసరాలకు వినియోగిస్తాం. 4-5నుంచి టీఎంసీలను మూసీ ప్రక్షాళన కోసం వాడుతాం. దీంతో నల్గొండ జిల్లాలో ఉన్న ఫ్లోరైడ్? సమస్యను నిర్మూలిస్తాం” -రేవంత్ రెడ్డి, సీఎం

గోదావరి జలాలతో హైదరాబాద్ తాగునీటి సమస్య పరిష్కారమే కాకుండా, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య తీరుతుందని సీఎం రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ వల్లనే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరిగిందని ఆక్షేపించారు. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలని బీఆర్?ఎస్?ను ప్రశ్నించారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్లి అక్కడి సీఎం దేవేంద్ర ఫడ్నవీస్?ను కలిసి ఆదిలాబాద్?లోని తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై చర్చిస్తామని తెలిపారు. మూసీనది ప్రక్షాళన జరగకుండా కొందరు అడ్డుకుంటున్నారన్న సీఎం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**గోదావరి జలాలకు మూలం ఎల్లంపల్లి :** రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. కడుపులో విషం పెట్టుకుని అభివృద్ధిని అడ్డుకోవద్దని పరోక్షంగా విపక్షాలకు సూచించారు. ప్రస్తుతం జంట జలాశయాల వల్లే హైదరాబాద్‌కు తాగునీరు అందుతోందని, గోదావరి జలాలు నగరానికి వస్తున్నాయంటే దానికి మూలం ఎల్లంపల్లి ప్రాజెక్టే అని రేవంత్ రెడ్డి తెలిపారు.

దిల్లీ ప్రభుత్వం యమునా నది ప్రక్షాళన, గుజరాత్‌లో సబర్మతీ నది ప్రక్షాళన చేసినపుడు హైదరాబాద్‌లో మూసీ నది ప్రక్షాళన ఎందుకు చేసుకోకూడదో చెప్పాలని బీజేపీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన చేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని అక్కసుతో ప్రతిపక్షాలు ఉన్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం వాళ్లను తిప్పి కొడుతుందని స్పష్టం చేశారు. బుద్వేల్ ప్రాంతం హైదరాబాద్‌కు గేట్ వే ఆఫ్ లాంటిదని అభిప్రాయపడ్డారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రులు ప్రణాళికలు చేశారు కాబట్టే హైదరాబాద్‌కు గొప్ప పేరు వచ్చిందని, 10 ఏళ్లలో హైదరాబాద్‌ను ప్రపంచంలో గొప్ప నగరంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు

# కనిగిరి డిపోలో పేరుకే ఫ్యాన్లు

ప్రయాణికులు కూర్చున్న హాలులో తిరగని ఫ్యాన్లు

ఫ్యాన్లు ఉన్నాకూడా అవి తిరగవు

మరుగుదొడ్ల దగ్గర ఒక్క ఫ్యాన్ మాత్రమే పనిచేసేది

ఆర్టీసీకి కరెంట్ చార్జీలు ఆదా చేస్తున్న కనిగిరి ఆర్టీసీ అధికారులు

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రయాణికులు




**కనిగిరి ప్రజలకుచేరువ ప్రతినిధి :** కనిగిరి డిపోలో ఫ్యాన్లు తిరగక ఆర్టీసీ ప్రయాణికులు ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరిఅవుతున్నారు .ప్రయాణికులు కూర్చునే హాలులో ఉండటానికి ఫ్యాన్లు పుస్కలంగా ఉన్నాయి. కాని అవి ఎప్పుడంటే అప్పుడు తిరగవు. ఆర్టీసీ అధికారులకు ఇష్టమొచ్చినప్పుడు ఫ్యాన్లు వేస్తారు లేక పోతే లేదు అడిగేవారు ఉండరు కనుక వారిష్టం.సోమవారం మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఎక్కువుగా ఉండటమే కాకుండ ఉక్కపోతతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దిపడ్డారు. ప్రజలకు చేరువ దునపత్రిక ప్రతినిధి సోమవారం మధ్యాహ్నం 12:30 నుండి 1:30 అంటే సుమారు గంట సమయంలో అక్కడ ఫ్యాన్లు తిరగకపోవడం గమనించడం జరిగింది. అసమయంలో ప్రయాణికుల హాలు ప్రక్కనే ఉన్న మరుగుదొడ్ల దగ్గర ఒక ఫ్యాన్ తిరుగుతుంది.ఇక్కడ ఫ్యాన్ తిరుగుంది హాలులో ఎందుకు తిరగటంలేదని మరుగుదొడ్ల నిర్వాకరాలిని అడగగా ఈ ఫ్యాన్ కు హాలులో ఉండే ఫ్యాన్లలకు సంబంధంలేదని తెలిపింది. అసమయంలో ఒక వేల కరెంట్ లేక పోతే మరుగుదొడ్లదగ్గర ఉన్న ఫ్యాన్ ఎందుకు తిరుగుతుంది. దీనినిబట్టిచూస్తే ప్రయాణికుల సౌకర్యం ఎలా ఉన్న మాకేంసంబంధంఅన్నట్లుగా వ్యవహారించడమే కాకుండ కరెంట్ బిల్లు ఆర్టీసీకి కనిగిరి డిపో అధికారులు ఆదాచేస్తున్నట్లు తెలుస్తుంది. ఆర్టీసీకి కరెంట్ బిల్లు ఆదా చేస్తునందుకు అభినందించలో లేక ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తునందుకు విమర్శించాలో ఆది ప్రయాణికులకే వదిలేదాం. ప్రయాణికులే మాకు దేవుళ్ళు అనే వారిమాటలు మాటలకే పరిమితమని చెప్పాలి.

# సంపూర్ణమైన చంద్రగ్రహణం

దాదాపు మూడు గంటలపాటు వీక్షించినజనం

సెల్ ఫోన్లలో బంధీ అయినా చంద్రన్న

జిల్లాలో మూతపాడిన ఆలయాలు.. కనిగిరిలో రోల్లో నిలబడిన రోకలి !







**ప్రకాశం, ప్రజలకుచేరువ ప్రతినిధి :** ఆదివారం ఏర్పడిన చంద్రగ్రహణం సంపూర్ణమయ్యింది. ఎన్నడులేనివి ధంగా చంద్రుడు పరి పరి విధాలుగా చూపరులకు కనపడుతూ కన్నుల పండుగ చేశాడు. చివరిగా చంద్రుడు కనుమరుగయ్యాడు. చంద్రగ్రహణాన్ని చూసేందుకు ప్రజలు కొందరు నిద్రలుకూడ మేలుకున్నారు.చంద్రుడు ఎర్రగా మారడం, సగం నల్లగా,పూర్తిగా నల్లగా మారటం వంటి సన్నివేశాలను యూత్ సెల్ ఫోన్ లలో చంద్రుడుని బందించారు.జిల్లాలోని దేవాలయాలను ఆదివారం రాత్రి 7గంటలనుండి సోమవారం ఉదయం 7 గంటలవరకు మూతపడ్డాయి. తరువాత యదా తదంగా పూజలు జరిగాయి.కనిగిరి పట్టణంలో రోలులో ఎటువంటి ఆధారాలు లేకుండ రోకలి నిటారుగా లబడటం అక్కడవారిని ఆచ్చర్యనికి గురించేసింది. తరాలు మారిన సనాతన సంప్రదాయాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అనడానికి ఈ చిత్రమే ఉదాహరణమని చెప్పవచ్చు.

## రైతులను ఇక్కట్లకు గురి చేస్తున్నా

# కూటమి ప్రభుత్వం !

మండల కేంద్రంలో 2886 ఎకరాలకు 200 బస్తాల! : వైసిపి నేత పరవాడ మహేష్



**చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి :** రాష్ట్రంలో రైతంగానికి కూటమి ప్రభుత్వం ఇక్కట్లకు గురి చేస్తుందని చీడికాడ వైసిపి నేత పరవాడ మహేష్ అన్నారు. చీడికాడ లోని తన నివాస గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేదంటూ పూర్తిస్థాయిలో యూరియా అందించడం లేదని దీంతో రైతులు చోడవరం అనకాపల్లి వెళ్లి కొనుక్కునే దుస్థితి నెలకొంది అన్నారు. చీడికాడ గ్రామంలో 1400 పట్టాదారు పాసు పుస్తకాలకు గాను 2886 ఎకరాల వరి సాగు చేశారని చీడికాడ రైతు సేవ కేంద్రానికి రెండు వందల బస్తాల యూరియా పంపిస్తే ఏ విధంగా సరిపోతుందన్నారు. వచ్చిన యూరియా బస్తాల్లో అధిక శాతం కూటమి నేతలే తమకు నచ్చినన్ని తీసుకుపోయారని దీంతో రైతులకు పూర్తిస్థాయిలో అందలేదని ఆయన ఆరోపించారు. ఒకపక్క రైతు సంక్షేమమే మా ధ్యేయం రైతులకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం యూరియా కొడత లేకుండా చేస్తామంటూనే యూరియా పూర్తిస్థాయిలో సరఫరా చేయలేకపోతున్నారని ఇదేనా రైతు సంక్షేమం అని ఆయన ప్రశ్నించారు. రైతులకు ఈ సీజన్లో ఎరువులు కావాలని అటువంటి ఎరువులే అందించ లేకపోతే ఇక రైతు ఏ విధంగా వరి సాగు చేయగలరని అన్నదాతను అడుక్కునే వారిగా మార్చే విధంగా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు 16 నెలలు కావస్తున్న రైతుకు సహకారం అందించడం లేదని రైతు భరోసా సైతం పూర్తిస్థాయిలో అందించలేదని లేని పోనీ కొర్రలు వేస్తూ రైతులను ఇబ్బందులు చేసిందని, ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కయి బ్లాక్ మార్కెట్కు తరలించే విధంగా ప్రయత్నస్తోందన్నారు. వరి నాట్లు వేసి సుమారు రెండు నెలలు దాటుతున్న మండల హెడ్ కోటర్ లో ఉన్న కూటమి నేతలు రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందించే విధంగా కృషి చేయలేదని, దీంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఒక్కొక్క బస్తాకు సుమారు 500 రూపాయల వరకు ఖర్చుపెట్టి ఉదయం నుండి సాయంత్రం వరకు పడిగాపులు కాసి బస్తాకు 30 నుండి 50 రూపాయలు రవాణా చార్జీలు పెట్టుకుని తెచ్చుకునే పరిస్థితిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సకాలంలో ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పరవాడ ప్రసాదు, కరగాన శివకుమార్, పరవాడ రామారావు, కామిరెడ్డి గడ్డం నాయుడు, నూనెల పైడితల్లి పాల్గొన్నారు.



# యూరియా కొరతను తీర్చండి

తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన సిపిఐ నాయకులు

**కనిగిరి, ప్రజలకు చేరువ ప్రతినిధి**

యూరియా మరియు డిఏపి కొరతతో రైతులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని సిపిఐ మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్ అధ్యక్షతన స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.రవీంద్రబాబు అన్నారు.యూరియాతోపాటు రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని డీలర్లు, కూటమినేతలు కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని వారు అన్నారు కూటమినేతలు కేంద్రంలో మేమే రాష్ట్రంలో మేమే డబల్ ఇంజన్ సర్కారు అధికారంలో ఉన్నదని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ప్రభుత్వం ముందుచూపు లేని కారణంగా రైతులకు అవసరమైన యూరియా డిఏపి అలాగే ఇతర ఎరువుల కొరత ఏర్పడిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జి.పి.రామారావు నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్, రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, కాసిం పీరా, రాము, పుట్టా సుబ్బారావు, అంకమ్మ రాపూరి.కోటయ్య పి.శ్రీను యు.వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును

# పునః రుద్ధరించాలి



**(హనుమంతునిపాడు/కనిగిరి ప్రజలకు చేరువ. ప్రతినిధి)**

భవన నిర్మాణ కార్మికులకు వారి సంక్షేమ బోర్డును పునః రిద్ధాంచాలాని కోరుతూసోమవారంహనుమంతునిపాడు మండల తాసిల్దార్ కార్యాలయం దగ్గర భవనిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ హనుమం తునిపాడు మండలంలోని 23 గ్రామపంచాయతీలలో దాదాపు 600 మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు వృత్తి చేసుకొని జీవిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా ఇప్పటికీ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో మీనా మీసాలు లెక్కిస్తుందని అన్నారు.భవనిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు అందరికీ సంక్షేమ పథకాల అమలు చేయాలని లేని పక్షంలో భవనిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు గోననాగయ్య, గూడూరి కొండయ్య ,గోన ఆంద్రి ,కోలా యేసు, గురునాథం, రాములు ధార బాలసౌరి, గూడూరి జాన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా

# స్నేహహస్తం ట్రస్ట్



### ప్రభుత్వాసుపత్రిలో భోజన వసతి కలిపించిన స్నేహహస్థం సభ్యులు

**కనిగిరి ప్రజలకు చేరువ ప్రతినిధి**

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులు, వారి బంధువులు, పేదవారికి ఉచిత భోజన వసతి కల్పించారు. ట్రస్ట్ సభ్యులు స్వయంగా భోజనం పంపిణీ చేస్తూ, ప్రేమ–పరమార్ధంతో ఆదుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ పేదవారికి ఆహారం సమకూర్చడం చాలా ఆనందం అనిపి స్తోంది. మానవసేవే మాధవసేవ అన్న భావనతో మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశ నింపగలదు. ఈ ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూ మరెందరికో ఉపశమనం కలిగించాలని కోరుకుంటున్నాం అని అన్నారు. ట్రస్ట్ సభ్యులు ఈ సందర్భంగా భవిష్య త్తులోనూ పేదలకు భోజన వసతి, వైద్య సహాయం, విద్యా రంగంలోనూ సాయము అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, స్నేహహస్తం సభ్యులు శ్రీను, మీరా మొహిదీన్, మోహన్ కుమార్, గౌస్, కాసింపీరా, ఈర్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడే అన్నదాత పోరు

పెద్దఎత్తున్న హాజరుకాకున్నా రైతులు

కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలన్న వైసీపి ఇంచార్జి దద్దాల




**కనిగిరి, ప్రజలకుచేరువ ప్రతినిధి :** రాష్ట్రంలో అన్నదాత పడుతున్న కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకోచ్చేందుకు వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9వ తేదిన అనగా మంగళవారం కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమం జరగనున్నది. నియోజకవర్గంలోని అరుమండలాలలోని రైతులు అధికసంఖ్యలో పాలుగుంటారనేది సమాచారం. అందుకు అనుగుణంగా ఆదివారాం కనిగిరి నియోజకవర్గ కేంద్రంలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరుకు సంబంధించిన వాల్పోస్టర్ ను పార్టీ నాయకులతో కలిసి దద్దాల నారాయణ యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నదాత సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.రాష్ట్రంలో ఎరువుల కొరత ప్రధాన సమస్యగా ఉందని, రైతులు క్యూలో నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతులకు చెందాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలించేసి కృత్రిమ సంక్షోభం సృష్టించారని,వ్యవసాయశాఖ మంత్రి దీన్ని పట్టించుకోకుండా రైతులపై చులకనగా మాట్లాడుతున్నారు ఇది సిగ్గు చేటన్నారు.నేడు జరుగు అన్నదాతపోరులో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు.

## తహసిల్దార్ కార్యాలయం వద్ద

# కూరగాయల స్టాల్



**పొన్నలూరు, ప్రజలకి చేరువ ప్రతినిధి :** పొన్నలూరు తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూరగాయలు స్టాల్ ను ఏర్పాటు చేశారు.మండల వ్యవసాయాధికారి వి రాము ముఖ్య అతిథిగా పాల్గొని సేంద్రియ వ్యవసాయం పద్ధతి అనగా రసాయన ఎరువులు, పురుగు మందులు, తెగులు మందులు వాడకుండా సహజ సిద్ధమైన ఆవు మూత్రం, ఆవు పేడ, ఘన, ద్రవ్య జీవామృతం కషాయాలతో తయారు చేసి పండించిన కూరగాయలు తినడం వలన సహజ సిద్ధమైన పోషక విలువలుతో కూడిన ఆహారం తీసుకోవచ్చునని, తద్వారా రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని తెలియజేసారు. ప్రతి సోమవారం ఈ స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో రావులకొల్లు గ్రామంలో పండిస్తున్నట్లు తెలియజేసారు, పై కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్ 2. డి.మందాకిని, ఎల్ 3. డి. జ్యోత్స్న, పి. ఏడుకొండలు, జి. నాగరాజు రైతులు పాల్గొన్నారు.

# అట్టపెట్టెలకి అంకితమైన కంప్యూటర్లు

విద్యార్థులకు అందని కంప్యూటర్ బోధన



**చీడికాడ, ప్రజలకి చేరువ ప్రతినిధి :** నాలుగు నెలలుగా కంప్యూటర్ లు అట్టపెట్టలకే పరిమితమయ్యాయి. కంప్యూటర్లో నేర్చుకుందాం అనుకున్న విద్యార్థులకు కంప్యూటర్ బోధన నాలుగు నెలలవుతున్న అందడం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం కంప్యూటర్లు సరఫరా చేసిన వాటి ద్వారా విద్యార్థులకు బోధించే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ లక్ష్యం అమోఘంగా కనిపిస్తున్నప్పటికీ అమలులో అధికారుల నిర్లక్ష్యత కొట్టొచ్చినట్లు కనబడుతోంది. మండలంలోని కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి కంప్యూటర్ విద్యను విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని కేజీబీవీ బాలికల పాఠశాల, చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మంచాల ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ విద్యను అందించేందుకు ఎస్ఎస్ ఏ(సర్వ శిక్ష అభియాన్) ద్వారా లక్షలాది రూపాయల విలువైన కంప్యూటర్లను ఈ ఏడాది ప్రారంభ సమయంలో పాఠశాలలకు సరఫరా చేశారు. కంప్యూటర్లో వచ్చి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ వాడితే ఎక్కడ పాడైపోతాయో అని అట్టపెట్టెల్లో భద్రపరిచినట్లు పాఠశాలల్లో అట్టపెట్టలకే పరిమితమై కంప్యూటర్ లు దర్శనమిస్తున్నాయి.ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సాంకేతిక పరంగా విద్యలో అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వం విద్యా రంగానికి అందిస్తున్న పథకాలలో భాగంగా సర్వ శిక్ష అభియాన్ (ఎస్ ఎస్ ఎ) పథకం ద్వారా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లు పంపిణీ జరిగింది. చీడికాడ మండల కేంద్రంలోనీ ప్రభుత్వం పాఠశాలలో అయితే పాఠశాలలో ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా పాఠశాలలో కంప్యూటర్లు స్టోర్ రూమ్ లో నిరుపయోగంగా ఉన్నాయి. ఈ విషయంపై ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోవింద వద్ద ప్రస్తావించగా ఈ కంప్యూటర్లు పాఠశాలలో గదిలో (ఇన్స్టాలేషన్) అమర్చమని తమకు ప్రభుత్వం నుండి ఎలాంటి సూచనలు రాలేదని తెలిపారు. అయితే ఈ విషయంపై అవుట్సోర్సింగ్ ద్వారా నియమితులైన కంప్యూటర్ బోధకుడు నేతాజీని అడగ్గా కంప్యూటర్ విద్య బోధించమని తనని నియమించారని, కానీ ఇప్పటివరకు కంప్యూటర్లు గదిలో ఇన్స్టాలేషన్ చేయలేదని, పై అధికారులని అడిగితే తననే అమర్చుకోమని, బిల్లులు పెట్టుకోమని చెబుతున్నారన్నారూ కానీ అది తనకు సాధ్యం కాదని అంతా పెట్టుబడి నేను పెట్టలేనని మరల పై అధికారులకు తెలియజేస్తానన్నారు. అయితే పదవ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ బోధన పై కూడా పరీక్ష ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతుండగా అసలు కంప్యూటర్ బోధనే జరగకపోతే విద్యార్థులు ఏ విధంగా పరీక్షలు రాస్తారో అంత చిక్కడం లేదు. వర్షం వస్తుంది తడవకుండా బిల్డింగ్ చూద్దాం వర్షం తగ్గితే వెళ్ళిపోదాం అన్న ధోరణిలో ప్రభుత్వం ఆదేశించింది కంప్యూటర్లు పంపించేసాము అవి బిగించి బోధించిన బోధించకపోయినా తమకేంటి అన్న ధరణిలో అధికారులు తీరు కనిపిస్తోంది. మూడు ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లు వచ్చి అవి అట్ట బాక్సులకే పరిమితమై ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేసి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు చేపట్టకపోవడం విద్యార్థుల దురదృష్టకరం అనక తప్పదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంప్యూటర్లో అమర్చి విద్యార్థులకు కంప్యూ టర్ బోధన అందించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

### ఆర్భాటంగా ప్రారంభించారు..

# అర్ధాంతంగా వదిలేశారు

**అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్ లో నిర్మిస్తాం**

**మార్కాపురం మెడికల్ కాలేజ్ 2026 -27 లో తరగతులు ప్రారంభిస్తాం**

**మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలుగొండ పూర్తి చేస్తాం**

**మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**




**ప్రకాశం / మార్కాపురం,ప్రజలకి చేరువ ప్రతినిధి** : నాడు వైసిపి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ఆర్భాటంగా ప్రకటించి నిర్మాణాలను గాలికొదిలేసిందని,అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్ లో పూర్తి చేస్తామని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం నాడు ప్రకాశం జిల్లా మార్కాపురం రాయవరంలో మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే కందులనారాయణరెడ్డి,యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుతో కలసి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.నాడు వైసిపి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ఆర్భాటంగా ప్రకటించి నిర్మాణాలను గాలికొదిలేసిందని,అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్ లో పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం క్యాబినెట్లో నిర్ణయం తీసుకుంది. మెడిసిన్ విద్యను ప్రభుత్వం ప్రవేటు పరం చేస్తుందంటూ దీనిపై వైసీపీ ప్రజల్లో తప్పుడు ప్రచారాలు చేస్తోంది. మార్కాపురంలో మెడికల్ కాలేజ్ పనులు 18.8 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కానీ 80 శాతం పూర్తి చేసే ముందు వైసిపి అబద్ధాలు చెప్పుకోవడం సిగ్గుచేటు. గత వైసీపీ ప్రభుత్వం కనీసం ఒక్క భవనం కూడా పూర్తి చేయలేదు.మార్కాపురం మెడికల్ కాలేజ్ పూర్తిచేసి 2026 - 2027 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభిస్తాం.మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, అరకు మెడికల్ కాలేజీలను మొదట విడతగా పూర్తి చేస్తాం. రాష్ట్రంలో మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలను ప్రోత్సహించి పేద విద్యార్థులకు మెడిసిన్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే అవకాశం కల్పించింది ఎన్డీఏ ప్రభుత్వమే. వెలుగొండ పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోసం చేశారు. మేము ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తాం, వెలిగొండ పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. ఈ ప్రాంత ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు.

### వినాయక ఊరేగింపులో పోలీసులపై దాడిని ఖండించిన

# రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం



**ఒంగోలు, ప్రజలకి చేరువ ప్రతినిధి** : ఒంగోలు, కర్నూలు రోడ్ ఫ్లై ఓవర్ దగ్గర విధులు నిర్వర్తిస్తున్న పోలీసులపై జరిగిన దాడిని రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది.సమాజ శాంతి భద్రతల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులపై జరిగిన ఈ దాడి అమానుషమని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం పేర్కొంది. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో నిమగ్నమై ఉన్న పోలీసులపై ఇలాంటి దాడులు తీవ్రంగా ఖండనీయమని సంఘం తీవ్రంగా ఖండించింది.ఈ అమానుషమైన, అరాచక పూరిత ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే పోలీసులపై ఇలాంటి దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించ బోమని సంఘం స్పష్టంచేసింది.ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం ప్రభుత్వ, ఉన్నతాధికారులను కోరింది. 2025 ఈనెల 7న మధ్యాహ్నం సుమారు 12:00 గంటలకు ఒంగోలు పట్టణంలోని ఫ్లై ఓవర్ దగ్గర వినాయక చవితి ఊరేగింపులో శాంతి భద్రతల పరిరక్షణ కోసం డ్యూటీ చేస్తున్న సమయంలో శ్రీనగర్ కాలనీ 4వ లైన్ లో వెన్నపూస వెంకటేశ్వర్ రెడ్డి 45వ డివిజన్ వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు (45వ డివిజన్ కార్పొరేటర్ భర్త) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం ఊరేగింపు కార్యక్రమంలో కర్నూలు ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఎస్సై డి శ్రీనివాసరావు సిబ్బంది జి.రవికుమార్ (కానిస్టేబుల్) అధిక సౌండ్ తో వస్తున్న డీజే స్పీకర్ బాక్సులు కర్నూల్ ఫ్లైఓవర్ దగ్గర ఆపి, అధిక ధ్వని లేకుండా వినాయకుని ఊరేగింపు కార్యక్రమం జరుపుకోమని ట్రాఫిక్ సిబ్బంది కమిటీకి తెలియ జేయగా, మద్యం మత్తులో ఉన్న యువకులు ఎవడ్రా మా డీజే ఆపేదని అసభ్యకర పదజాలంతో డ్యూటీ లో ఉన్న ఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రవికుమార్ పై దాడి చేసినారు. అదే రోజు సాయంత్రం ఒంగోలు టౌన్ డిఎస్పి ఆఫీస్ వద్ద విధులు నిర్వర్తించుచున్న సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రకాశం జిల్లా ఎస్పీని కోరారు.ఇటీవల హైదరాబాద్ మల్కాజిగిరిలో డీజే సౌండ్ కారణంగా ఒక కానిస్టేబుల్ మరణించిన ఘటన అందరికీ తెలిసిందే. అటువంటి విషాద సంఘటనలు పునరావృతం కాకుండా, టౌన్‌లో వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డీజే సౌండ్ సిస్టమ్స్, అధిక శబ్దమిచ్చే మైకులను వినియోగించ కుండా, వినాయక నిమజ్జన ఊరేగింపులు నిర్వహిం చాలని పోలీసులు సూచించారు. అంతేకాక వ్యక్తిగత అజెండాలతో పోలీసులపై దాడులు చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి, చట్టానికి వ్యతి రేకం మన్నారు. ఈ విషయంపై ప్రకాశం జిల్లా ఎస్పీ మరల పోలీసులపై భౌతిక దాడులు జరగకుండా చట్ట ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామ న్నారు. ఆంధ్రప్రదేశ్ డీజీపీ ని రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, పోలీసులపై దాడి చేసిన వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ సంఘం కోరుతుందన్నారు. పోలీస్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ సెక్రటరీ సిహెచ్. హజరత్తయ్య (సీఐ సింగరాయకొండ), రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తిరుపతి స్వామి (ఆర్ఎస్ఐ ప్రకాశం జిల్లా), కో ఆప్షన్ సభ్యులు ఐ. మాల్యాద్రి (ఎఎస్ఐ), మహిళ హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి, ఏఎస్ఐ అహ్మద్ భాష, మద్దిపాడు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శివరామకృష్ణ, ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో 11 రోజులుగా జరుగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో శాంతిభద్రతల కోసం పోలీసులు రాత్రి పగలు నిద్ర మానుకొని కృషి చేస్తున్నారని, ఇలాంటి సందర్భంలో విధుల్లో ఉన్న అధికారులపై దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు వెంటనే తీసుకోవాలి. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీసులు తమ కుటుంబాలను, వ్యక్తిగత జీవితాన్ని పక్కనబెట్టి, ప్రజల భద్రత కోసం పగలు,రాత్రులు కష్టపడతారు. వారి సేవలకు గుర్తింపు ఇవ్వకుండా, దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి, చట్ట వ్యవస్థకు వ్యతిరేకం. భవిష్యత్తులో శాంతిభద్రతలకు సవాళ్లు విసిరే వారందరికీ చట్టం ముందు ఎవరూ పెద్దవారు కాదన్న సంకేతం ఇవ్వాలని సంఘం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ఇలాంటి కఠినమైన చర్యల ద్వారానే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించవచ్చు. ప్రజాస్వామ్యంలో చట్టానికీ, శాంతి భద్రతలకూ అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, వాటిని కాపాడటానికి పోలీసులు చేస్తున్న కృషికి సమాజంలోని ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పోలీస్ అధికారుల సంఘం ఈ పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.



# చైనా వాల్ దాటిన 'మిరాయ్' పాప

అచూస్తుండగానే చైనా వాల్ దాటేయబోతోంది ఈ కొత్తమ్మాయ్. మిరాయ్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా దేశాలన్నీ చుట్టేయబోతోంది. ముంబైలో ఒక్క ఛాన్స్ అంటూ అవకాశాల కోసం వెతికిన ఈ మోడల్ కం నటి, ఉన్నట్టుండి తేజ సజ్జా సినిమాతో వరల్డ్ ఫేమస్ కాబోతోంది. కొత్తమ్మాయ్ అయినా కానీ తనవైన వన్నె చిన్నెలు, గ్లామరస్ లుక్ తో మతులు చెడగొడుతోంది. ప్రస్తుతం ఏ నోట విన్నా ఈ అమ్మడి లక్ గురించే గుసగుస. పేరు రితిక నాయక్. ఢిల్లీలోని ఒడియా కుటుంబంలో జన్మించిన ఈ ప్రతిభావని టాలీవుడ్ లో వరుస అవకాశాలు అందుకుంటోంది. 2019లో ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ యొక్క 12వ సీజన్‌ను గెలుచుకున్న తర్వాత వినోద పరిశ్రమలో బిగ్ డ్రీమ్స్ ని నెరవేర్చుకోవడానికి ప్రయాణం ప్రారంభించింది. కాలేజ్ డేస్ నుంచే నటన అంటే ఈ భామకు ఆసక్తి. ఆరంభం, అశోక వనంలో అర్జున కళ్యాణం (2022)తో తెరంగేట్రం చేసింది. ఈ చిత్రంలో వసుధగా తనదైన అద్భుత నటనతో యువతరాన్ని ఆకట్టుకుంది. విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి విద్యాసాగర్ చింత దర్శకత్వం వహించారు. ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాలో రితిక నటనకు ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత రవితేజ ఈగిల్ లో కీలక పాత్ర పోషించినా పెద్దగా గుర్తింపు దక్కలేదు. ఇప్పుడు మిరాయ్ చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా పాపులరైపోతోంది. హనుమాన్ చిత్రంతో తేజ సజ్జా పాన్ ఇండియా స్టార్ గా గుర్తింపు తెచ్చుకోవడంతో ఇప్పుడు ఇది ఈ భామకు కూడా కలిసొస్తోంది. మిరాయ్ కథ, విజువలైజేషన్ పాన్ ఇండియా అప్పీల్ తో అలరించడంతో మార్కెట్లో ఈ మూవీపై బోలెడంత బజ్ పెరిగింది. ఇక ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కొడితే, తేజ సజ్జాతో పాటు రితిక నాయక్ దశ తిరిగిపోతుందని కూడా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికి కొత్తమ్మాయే అయినా, సినిమా రిలీజ్ తర్వాత అమాంతం తన రేంజ్ మారిపోతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక రితిక ఇప్పటికే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సినిమాలోను అవకాశం అందుకుంది.

### సంక్రాంతి రేసు..

# ట్విస్ట్ మీద ట్విస్ట్



తెలుగు సినిమాల వరకు అత్యంత డిమాండ్ ఉండే సీజన్ అంటే సంక్రాంతినే. చాలా ముందుగానే ఆ సీజన్‌కు బెర్తులు బుక్ అవుతుంటాయి. తెలుగు సినిమాల వరకు అత్యంత డిమాండ్ ఉండే సీజన్ అంటే సంక్రాంతినే. చాలా ముందుగానే ఆ సీజన్‌కు బెర్తులు బుక్ అవుతుంటాయి. కానీ కర్చీఫ్ వేసిన వాళ్లందరూ కచ్చితంగా ఆ సీజన్లో వస్తారని గ్యారెంటీ ఏమీ ఉండదు. ఆర్నెల్ల ముందు మొదలయ్యే రేసులో చివరికి మూణ్నాలుగు సినిమాలు నిలుస్తుంటాయి. మధ్యలో మార్పులు చేర్పులు జరుగుతూ ఉంటాయి. ఐతే 2026 సంక్రాంతి సీజన్‌కు సంబంధించి ఆల్రెడీ బెర్తులు కన్ఫమ్ అయిపోయాయని.. ఇక మార్పులేమీ ఉండవని అంతా ఒక అంచనాకు వచ్చేశారు. మెగాస్టార్ చిరంజీవి-అనిల్ రావిపూడిల 'మన శంకర వరప్రసాద్', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సినిమాలు చాలా ముందే సంక్రాంతి రిలీజ్ ఫిక్స్ చేసుకుని.. ఆ దిశగా సినిమాలను రెడీ చేసే పనిలో ఉన్నాయి. ఇటీవలే 'రాజా సాబ్' కూడా సంక్రాతికే అని ఖరారైంది. మరోవైపు తమిళ అనువాదం 'జనగాయగన్' కూడా రేసులో ఉంటుందన్నది స్పష్టం. ఇంతకుమించి సినిమాలు వచ్చినా థియేటర్లను సర్దుబాటు చేయడం కష్టం. కాబట్టి అంతటితో పోటీ ముగిసిందని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు కొత్తగా సినిమాలు పోటీలోకి వస్తుండడం ఆశ్చర్యం కలిగించే విషయం. మాస్ రాజా రవితేజ హీరోగా కిషోర్ తిరుమల రూపొందిస్తున్న సినిమాను ఇంతకుముందు సంక్రాంతికే తీసుకురానున్నట్లు ప్రకటించారు. కానీ షూటింగ్ మొదలయ్యాక దీని గురించి ఏ అప్‌డేట్ లేదు. కొన్ని నెలల పాటు చిత్ర బృందం సైలెంట్‌గా ఉండడంతో ఇది సంక్రాంతికి రాదనే అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు చూస్తే ఆ సినిమా పండక్కి పక్కా అంటున్నారు. సంక్రాంతికి సినిమాను థియేటర్లలో రిలీజ్ చేసేలా ఓటీటీ డీల్ కూడా పూర్తయిందట. కాబట్టి మాస్ రాజా కూడా సంక్రాంతి పోటీలో ఉండడం గ్యారెంటీ అంటున్నారు. మరోవైపు శర్వానంద్ హీరోగా 'సామజవరగమన' దర్శకుడు భాను భోగవరపు తీస్తున్న 'నారి నారి నడుమ మురారి' సినిమా సైతం పండుగ పోటీలో ఉన్నట్లు ఆ చిత్ర బృందం మీడియాకు లీకులు వదిలింది. త్వరలోనే వాళ్లు కూడా రిలీజ్ డేట్ పోస్టర్ రిలీజ్ చేయనున్నారట.

# ఈ జీవితం ఆయనకే అంకితం



చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరియర్ మొదలుపెట్టి.. సమంత లీడ్ రోల్ పోషిస్తూ వచ్చిన 'ఓ బేబీ' చిత్రం ద్వారా క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించి, ఆ తర్వాత ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'జాంబిరెడ్డి' సినిమాతో హీరోగా మారారు. ఇక హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా హీరోగా ప్రేక్షకులను మెప్పించిన తేజ సజ్జా.. ఇప్పుడు సూపర్ యోధాగా మిరాయ్ చిత్రంతో సెప్టెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ నేపథ్యంలోనే పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటున్న తేజా సజ్జా తన జీవితం ఆయనకే అంకితం అంటూ పలు ఊహించని కామెంట్లు చేశారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. తేజ సజ్జా తన మిరాయ్ మూవీ ప్రమోషన్స్ లో మాట్లాడుతూ.. "నేను ఇండస్ట్రీలోకి రావడానికి మెయిన్ కారణం చిరంజీవి గారే.. చిరంజీవి సార్ ఆరోజు నా ఫోటో చూజ్ చేసుకోకపోయి ఉంటే నేను ఇప్పుడు ఇండస్ట్రీలో ఉండేవాడిని కాదు.ఎందుకంటే 'చూడాలని ఉంది' సినిమా టైంలో చాలామంది చిన్న పిల్లల ఫోటోలు చిరంజీవి సార్ దగ్గరికి వచ్చాయి.. అందులో ఎవరినైనా ఒకరిని సెలెక్ట్ చేయమని సార్ కి చెప్పారు.కానీ ఆయన ఆరోజు నా ఫోటోనే సెలెక్ట్ చేశారు. ఒకవేళ ఆరోజు చిరంజీవి సార్ నా ఫోటో సెలెక్ట్ చేయకపోయి ఉంటే ఈ రోజు ఇండస్ట్రీలో నేను ఉండే వాడిని కాదు. ఒకరకంగా చెప్పాలి అంటే ఈ సినిమా జీవితం ఆయనకే అంకితం" అంటూ తేజా సజ్జా ఇన్ డైరెక్ట్ గా కామెంట్ చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. "నా చిన్నతనంలో నేను ఎంతోమంది గొప్ప వ్యక్తుల మధ్య పెరిగాను. ముఖ్యంగా చిరంజీవి నన్ను సొంత కొడుకులాగే చూసుకున్నారు.అందుకే చిరంజీవి సార్ మీద నాకు చాలా గౌరవం.. ఇక చిన్నతనంలో చాలామంది హీరోలతో నటించాను. పెద్దయ్యాక కూడా హీరో అవుతాను.. సినిమాల్లోనే రాణిస్తాను అని చెబితే మా వాళ్ళు భయపడ్డారు. ఎందుకంటే బ్యాక్ గ్రౌండ్ లేదు కాబట్టి.. ఇండస్ట్రీలో పరిస్థితులు ఎలా ఉంటాయో అని మా వాళ్లకు భయం.కానీ పట్టుబట్టి ఇండస్ట్రీలోకి వచ్చాను.

PRINTED,PUBLISHED AND OWNED BY NARALA MURALI PRINTED AT SUNDAY PRINTING PRESS, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006.
AND PUBLISHED FROM H NO. 5-212-4, KOTTURU , KANIGIRI, PRAKASAM, ANDHRA PRADESH - 523230 RNI NO : APTEL 2020/80178. CELL : +91 891 934 5606 EDITOR : KUMAR